సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



పెదవాగుకు పోటెత్తిన వరద

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. 8లో



మార్కెట్‌లో గణనాథులు సిద్ధం

ఈనెల 7న వినాయక చవితి నేపథ్యంలో గణపతి విగ్రహాలను భక్తులు ఇప్పటి నుంచే కొనుగోలు చేస్తున్నారు. 9లో

గరిష్టం / కనిష్టం 30° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు యాగశాలలో జరిగే ఈ హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని కోరారు. పూజలో పాల్గొనే వారు సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయొద్దని, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. మట్టి గోడల ఇళ్లు, పాకల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తెలిపారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటలు పర్యవేక్షణ నిమిత్తం 18 మంది సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. అవసరమైన వారు 08744-241950 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం వరకు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని వివరించారు.

గృహజ్యోతిపై అవగాహన కల్పించాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హత ఉండి కూడా 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పొందని వారు.. ఈనెల 17 నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాల్లో తిరిగి దరఖాస్తులు అందించేలా అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్ అన్నారు. శనివారం ఆయన విద్యుత్ సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు, వర్క్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేయాలని, 30 నుంచి 45 రోజుల వ్యవధిలో నూతన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని సూచించారు. పంట కోతల తర్వాత, యాసంగి సీజన్ మధ్య కాలంలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లన్నీ మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు.

నేడు అసిస్టెంట్ ఫోర్‌మెన్ అభ్యర్థులకు రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 10 అసిస్టెంట్ ఫోర్‌మెన్ (మెకానికల్) ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో ఈ పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు. సంస్థ వ్యాప్తంగా 126 మందికి హాల్‌టికెట్లు జారీ చేయగా, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

గుడ్‌మార్నింగ్.. కొత్తగూడెం!



జిల్లా వాసులకు ప్రభుత్వ రంగంలోని ఆకాశవాణి రేడియో 101.0తో పాటు మరో మూడు ఎఫ్‌ఎమ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల దేశంలోని 234 నగరాలు/పట్టణాల్లో ప్రైవేటు రంగంలో కొత్త రేడియో స్టేషన్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం ఆరు స్టేషన్ల ఏర్పాటుకు బిడ్లను ఆహ్వానించింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



కొత్తగూడెంలోని ఆకాశవాణి కేంద్రం

'వోకల్ ఫర్ లోకల్' పేరుతో ఎఫ్‌ఎం స్టేషన్లు

- ఉమ్మడి జిల్లాకు ఆరు మంజూరు
- 1980లోనే కొత్తగూడెంలో రేడియో ప్రసారాలు ప్రారంభం
- ఎఫ్‌ఎమ్ విస్తృతితో స్థానిక సంస్కృతి, కళలకు ఊతం

ఆకాశవాణి.. కొత్తగూడెం కేంద్రం

కొత్తగూడెంలో 1989లో ఆకాశవాణి ఎఫ్‌ఎం కేంద్రం ప్రారంభం కాగా, ఆ తర్వాత 1990లో వరంగల్ కేంద్రం నుంచి ఆలిండియా రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. అనంతరం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లో కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇక ప్రైవేట్ రంగంలో ఇప్పటి వరకు హైదరాబాద్, వరంగల్‌లోనే ఎఫ్‌ఎమ్ రేడియో స్టేషన్లు ఉన్నాయి.

1989లో తొలి ఎఫ్‌ఎం..

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కడప కేంద్రంగా ఉన్న ఆలిండియా రేడియో – ఆకాశవాణి కేంద్రాల ద్వారా రేడియో ప్రసారాలు జరిగేవి. ముఖ్యంగా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల పెళ్లి వేడుకలు లైవ్‌లో రేడియో ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు విని తరించేవారు. విజయవాడ రేడియో స్టేషన్‌కు చెందిన బృందం ఈ ప్రసారాలు అందించేది. ఆ తర్వాత రాష్ట్రంలోనే తొలి ఎఫ్‌ఎమ్ స్టేషన్‌ను 1989లో కొత్తగూడెంలోని రామవరంలో ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా సినిమా పాటలు ప్రసారం చేయడంతో పాటు సాధారణ వార్తలు, వ్యవసాయ సూచనలు, స్థానిక కళాకారులతో ఇంటర్వ్యూలు, సమకాలీన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటివి ప్రసారం అవుతున్నాయి.

ఆరు కేంద్రాలను అనుమతి..

స్థానికంగా ఆయా ప్రాంతాలకు ప్రత్యేకమైన భాష /యాస, సంస్కృతి సంప్రదాయాలకు విస్తృత ప్రచారం కల్పించే లక్ష్యంతో 'వోకల్ ఫర్ లోకల్' పేరుతో దేశ వ్యాప్తంగా విరివిగా ఎఫ్‌ఎమ్ రేడియో కేంద్రాలను అందుబాటులోకి తేవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో చెరి మూడు వంతున ఆరు రేడియో స్టేషన్లు ప్రారంభించేందుకు అనుమతులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో వ్యాపారం, వాణిజ్యం, విద్య, వైద్య రంగాల్లో దూసుకుపోతున్న ఖమ్మం, కొత్తగూడెం ఇప్పుడు ఎఫ్‌ఎమ్ రేడియోల రాకతో మరో మెట్టు పైకి చేరుకున్నట్టయింది.

వార్తలకు నో చాన్స్..

ప్రస్తుత మార్కెట్ లెక్కల ప్రకారం ఎఫ్‌ఎమ్ స్టేషన్ ప్రారంభించేందుకు కనీసం రూ. 50 లక్షల పెట్టుబడి అవసరం. రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో పది వరకు సంస్థలు ఎఫ్‌ఎమ్ సేవలు అందిస్తున్నాయి. రేడియో స్టేషన్లు ప్రారంభించే సంస్థలు 87.50 నుంచి 108.0 ఫ్రీక్వెన్సీలో వినోదం, సంస్కృతి, కళలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రసారాలు చేయాల్సి ఉంటుంది. వార్తలు ప్రసారం చేయడానికి వీలులేదు. రేడియో కేంద్రం చుట్టూ 30 కి.మీ పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఈ ప్రసారాలు స్పష్టంగా అందుతాయి.

ఎఫ్‌ఎమ్ ప్రసారాలు ప్రారంభించే సంస్థలు వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలి. వార్షిక ఆదాయంలో నాలుగు శాతం కేంద్ర ప్రభుత్వానికి పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.

స్థానికతకు ప్రోత్సాహం

ఎఫ్‌ఎమ్ రేడియో స్టేషన్లు ప్రారంభమైతే స్థానికంగా ప్రజలు మాట్లాడే యాస, ఇక్కడి కళాకారులు, కళలు, చారిత్రక ప్రాంతాలకు సంబంధించిన విశేషాలను ప్రచారం చేసేందుకు సరికొత్త మాధ్యమం అందుబాటులోకి వస్తుంది. రేడియో స్టేషన్ స్థాపనతో ఉపాధి లభించడంతో పాటు కుటీర పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారాలతో ప్రజల్లోకి చొచ్చుకుపోయేందుకు గల అవకాశాలు మెరుగు అవుతాయి.

ఇప్పటికే ఆలస్యమైంది..

ఎఫ్‌ఎమ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన వందేళ్ల తర్వాత తీరిగ్గా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో రేడియో సెట్లు మాయమైపోయాయి. 90 శాతం మంది మొబైల్ ఫోన్లలోనే ఎఫ్‌ఎమ్ ప్రసారాలు పొందుతున్నారు. గత ఆరు, ఏడేళ్లుగా మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు ఎఫ్‌ఎమ్ ఆప్షన్ క్రమంగా తొలగిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు చేసిన పనిని రెండు దశాబ్దాల క్రితమే చేసి ఉంటే మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఉత్తమ ర్యాంకులు సాధించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



అశ్వాపురం : మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వాపురం : డిగ్రీ విద్యార్థులు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం గిరిజన గురుకుల సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, భోజనశాలను పరిశీలించి.. మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు డిగ్రీ సెమిస్టర్‌తో పాటు సమకాలీన అంశాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్త్రీల పట్ల గౌరవం కలిగి ఉండాలని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ స్వప్న ఆకోజు, వైస్ ప్రిన్సిపాల్ రవి, ఏఓ కృష్ణ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి నాణ్యంగా ఉండాలి

భద్రాచలంటౌన్: గిరిజన విద్యార్థులు క్రీడల్లో సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా నాణ్యమైన క్రీడా సామగ్రిని ఎంపిక చేసినట్లు పీఓ రాహుల్ తెలిపారు. శనివారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ షాట్‌పుట్, జావలిన్ త్రో, హై జంప్ మ్యాట్‌తో పాటు 27 రకాల క్రీడా పరికరాలను ఎంపిక చేసి కిన్నెరసాని, కాచనపల్లి క్రీడా పాఠశాలలకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. పరికరాలు నాణ్యంగా లేకుంటే కోచ్‌లు ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కోచ్‌లు నిత్యం విద్యార్థులతో వారికి నచ్చిన క్రీడల్లో సాధన చేయిస్తుండాలని, వారికి క్రీడల్లో మెళకువలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. విద్యార్థులకు బలవర్ధక ఆహారంతో పాటు రాగి జావ వంటి ద్రవపదార్థాలు, సీజన్ల వారీగా పండ్లు అందించాలని సూచించారు. మాంసాహారం తీసుకోని విద్యార్థులకు పన్నీరు, మిల్‌మేకర్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, దావీద్, గోపాలరావు, రంగయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు



స్వామివారిని దర్శించుకుంటున్న స్తపతి శ్రీవల్లి నాయగం తదితరులు



అన్నపురెడ్డిపల్లి ఆలయంలో మాట్లాడుతున్న అహోబిల రామానుజ జీయర్ స్వామి

అన్నపురెడ్డిపల్లి: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్తపతి శ్రీవల్లి నాయగం తెలిపారు. శనివారం ఆయన అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామితో కలిసి అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఆగమ శాస్త్రం ప్రకారం చేయాల్సిన నిర్మాణాలపై అధికారులకు సూచనలు చేశారు. యాగశాల, గోశాల, కోనేరు నిర్మాణాల పనుల ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

అహోబిల రామానుజ జీయర్‌స్వామి పూజలు

శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారు సందర్శించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనాలు చేశారు. యువత సన్మార్గంలో నడిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం వికాస తరంగిణిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ, ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

డీఎఫ్ఓ కిష్టాగౌడ్



మాట్లాడుతున్న డీఎఫ్ఓ కిష్టాగౌడ్

చుంచుపల్లి: విధుల పట్ల అంకితభవంతో పనిచేస్తేనే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్ అన్నారు. ఎఫ్‌బీఓ సపావత్ పిచ్చయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొందరు సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ ఉన్నతాధికారులతో పాటు శాఖలో తనదైన ముద్ర వేసుకుంటారని అన్నారు. అటవీ శాఖలో ఉద్యోగం చేయడం పెను సవాల్‌గా నిలుస్తుందన్నారు. జిల్లాలో అడవుల రక్షణకు సిబ్బంది ఎనలేని సేవలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, సిబ్బంది సురేష్, భూక్యా లక్ష్మణ్, శ్రీనివాసరావు, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దు



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న బాబూరావు

సుజాతనగర్: రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావు అన్నారు. సర్వారం గ్రామంలో నిర్వహించిన కుటుంబ నిర్ధారణ సర్వే ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు. సాంకేతిక కారణాలతో కొందరు రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదని అన్నారు. జిల్లాలో 19,453 మంది రైతులకు రేషన్ కార్డులు లేనందున మాఫీ కాలేదన్నారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియ ద్వారా వీరందరి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సగటున 1,500 మంది రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని, ఇప్పటి వరకు 6,450 మంది రైతుల వివరాలను నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.నర్మద, ఏఈఓలు శరత్, నరసింహారావు, ప్రనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పైనుంచే రాకపోకలు

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో లెవల్ చప్టాపై మండలంలోని రాజాపురం – యానంబైల్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేళ్లయినా పూర్తి కాలేదు. దీంతో ఈ ప్రాంతంలోని 24 గ్రామాల వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇక వరదలు వచ్చి కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పుడు ఆయా గ్రామాల వారికి రాకపోకలు స్తంభిస్తాయి. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో పాల్వంచ నుంచి ఆ 24 గ్రామాలకు వెళ్లేవారు, అటు నుంచి వచ్చేవారు ఈ బ్రిడ్జి పైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రయాణం ప్రమాదమని తెలిసినా వారికి మరో 'మార్గం' లేదు. ఇక బ్రిడ్జిపై ఏర్పాటుచేసిన మట్టి రోడ్డు వర్షాలతో బురదమయమైంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు దీనిపై వెళ్లాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

'భవిత' బాగుండేలా...

- జిల్లాలో ఆరు కేంద్రాలకే శాశ్వత భవనాలు
- మండల కేంద్రాల్లోనూ నిర్మాణానికి కసరత్తు
- కలెక్టర్ ఆదేశాలతో మొదలైన సర్వే ప్రక్రియ
- పనులు పూర్తయితే దివ్యాంగ పిల్లలకు సౌకర్యం



పాల్వంచలోని భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగ పిల్లలు సైతం ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలనే సంకల్పంతో నూతన భవిత కేంద్రాల నిర్మాణానికి జిల్లాలో అడుగులు పడుతున్నాయి. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు, ప్రత్యేక చొరవతో విద్యాశాఖ అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభించారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు మొదట విద్యనభ్యసించేలా కేంద్రాల నిర్వాహకులు శిక్షణ ఇస్తారు. చదువుకునేందుకు సిద్ధమైన పిల్లల వయసు, జ్ఞానం, సామర్థ్యాలను పరిశీలించి వారు చదువగలిగే తరగతుల్లో చేర్పిస్తున్నారు. అయితే జిల్లాలో ఆరు మండలాల్లోనే భవిత కేంద్రాలకు శాశ్వత భవనాలు ఉన్నాయి. మిగితా మండలాల్లోనూ శాశ్వత భవనాలు నిర్మించాలని, దివ్యాంగ పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పాల్వంచలోని భవిత కేంద్రం భవనాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమ్మిళిత విద్యా అధికారులు పరిశీలించారు. అన్ని మండలాల్లోనూ అత్యాధునిక పద్ధతులతో భవనాల నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందనే వివరాలపై చర్చించారు. ఈ మేరకు నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేయనున్నారు.

జిల్లాలో 2,225 మంది దివ్యాంగ విద్యార్థులు..

జిల్లాలో ఆరు శాశ్వత భవనాల్లో భవిత కేంద్రాలు పని చేస్తుండగా, 24 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నాయి. జిల్లాలో మొత్తం 21 రకాల వైకల్యాలు గల దివ్యాంగ పిల్లలు 2,225 మంది ఉన్నారు. వీరిలో 1,816 మంది పిల్లలు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. భవిత కేంద్రాల్లో 281 మంది పిల్లలకు ప్రత్యేక బోధన సాగుతుండగా, 45 మంది బడి బయట ఉన్నారు. అయితే ప్రతి శనివారం 'హోం బెస్ట్ ఎడ్యుకేషన్' పేరుతో సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్లు పిల్లల ఇళ్లకు వెళ్లి బోధన చేస్తున్నారు. ఇక జిల్లాలోని 23 మండలాల్లోని 154 మంది దివ్యాంగ పిల్లల కోసం 9 మంది ఫిజియోథెరపిస్టులు వారానికి ఒక రోజు క్యాంపులు నిర్వహిస్తున్నారు. అర్హత గల దివ్యాంగ విద్యార్థులకు నెలకు రూ. 500, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ రూ.500, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.60, బాలికలందరికీ రూ.200 స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. ప్రతీ ఏడాది జిల్లాలో దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు జనవరి, మేలో రెండు విడతలుగా సర్వే నిర్వహించి యూడైస్, ప్రబంధ్ పోర్టల్లలో నమోదు చేస్తున్నారు. గతేడాది ఆలింకో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 445 మందికి రూ.35.10 లక్షల విలువైన 691 పరికరాలు, ఉపకరణాలను అందజేశారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



జిల్లాలో ప్రస్తుతం ఆరు శాశ్వత భవనాల్లో భవిత కేంద్రాలు కొనసాగుతున్నాయి. మిగతా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే బోధన సాగుతోంది. ఆయా చోట్ల కూడా శాశ్వత భవనాల నిర్మాణానికి కలెక్టర్ ఆదేశాలతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయితే దివ్యాంగ పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– ఎస్‌కే. సైదులు, జిల్లా సమ్మిళిత విద్యా కో–ఆర్డినేటర్

మళ్లీ పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఈనెల 23నుంచి గోల్కొండ, ఇంటర్‌సిటీ, 25నుంచి శాతవాహన



ఖమ్మం రాపర్తినగర్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా మరోమారు రైళ్లను రద్దు చేయనున్నారు. ఈ వివరాలను ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ. జాఫర్ వెల్లడించారు. గుంటూరు – సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) ఈనెల 24నుంచి అక్టోబర్ 8వరకు, సికింద్రాబాద్–గుంటూరు గోల్కొండ(17202) ఈనెల 23నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు, సికింద్రాబాద్–గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రానుపోను మార్గాల్లో(12706, 12705) ఈనెల 23నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు, సికింద్రాబాద్–విజయవాడ మార్గంలో నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12714, 12713) రెండు వైపులా ఈనెల 25నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రద్దవుతాయని తెలిపారు. అలాగే, కాజీపేట–విజయవాడ(07753), విజయవాడ – కాజీపేట(07754), డోర్నకల్ – విజయవాడ (07755)), విజయవాడ – డోర్నకల్ (07756) ప్యాసింజర్ రైళ్లను ఈనెల 25నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

జూలూరుపాడు : జూలూరుపాడుకు చెందిన విలేకరి ఎం.ప్రభాకర్‌కు కొద్ది రోజుల క్రితం దొరికిన సెల్‌ఫోన్‌ను సీఐ ఇంద్రసేనా రెడ్డికి అందజేశారు. పోలీసులు బాధితుడు, ఒడిశాకు చెందిన జానీ పరశురాంను పిలిపించి శనివారం ఫోన్ అప్పగించారు. జానీ పరశురాం కూలి పనుల నిమిత్తం జూలూరుపాడు మండలం సురారం గ్రామానికి వచ్చినప్పుడు ఫోన్ పోగొట్టుకున్నాడని ఎస్సై బి.రాణా ప్రతాప్ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుల్ ప్రసాద్, మాజీ సర్పంచ్ చింతా జగన్నాథం పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్సైల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లావ్యాప్తంగా ఐదుగురు ఎస్సైలను బదిలీలు చేస్తూ శనివారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి.సురేష్‌ను బదిలీపై పాల్వంచ రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. బి.శ్రీనివాస్‌ను పాల్వంచ రూరల్ పీఎస్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం వీఆర్‌కు కేటాయించారు. కె.సుమన్‌ను కొత్తగూడెం సీసీఎస్–2 నుంచి పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా, బి.రామును పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌ఓ నుంచి భద్రాద్రి కొత్తగూడెం వీఆర్‌కు కేటాయించారు. టీ.యాయతిరాజును ఖమ్మం కమిషరేట్ నుంచి అశ్వారావుపేట ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డీసీఎంఎస్ ఆస్తులను పరిరక్షిస్తాం



మాట్లాడుతున్న చైర్మన్ కొత్వాల

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఆస్తులను కొందరు ఆక్రమించాలని యత్నిస్తున్నందున ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు మధిరలో ఉన్న ఆస్తులను కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా పోలీసుల సహకారంతో రక్షించుకున్నామని తెలిపారు. అనంతరం డీసీఎంఎస్ అభివృద్ధి, ఇతర వ్యాపార కార్యకలాపాలపై సమావేశం నిర్వహించి చర్చించారు. డైరెక్టర్లు నాగుబండి శ్రీనివాసరావు, పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, తేళ్ల కోటయ్య, మారుతి ఎట్టయ్య, బిజినెస్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.85 లక్షలకు ఐపీ దాఖలు చేసిన వ్యాపారి

ఖమ్మం లీగల్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని మామిళ్లగూడెంకు చెందిన వ్యాసపారి రావిరాల శివనాగ ప్రసాద్ రూ.85.70లక్షలకుగాను దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. మణికంఠ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ షాపు నిర్వహించిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్దే కాక మనీ లోన్ యాప్‌లు, క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు తీసుకున్నాడు. ఆపై వ్యాపారంలో తీవ్రంగా నష్టం వచ్చిందని, రుణం తీర్చే మార్గం లేదంటూ 18 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ

సత్తుపల్లి: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్ నుంచి సెల్‌పోన్ చోరీకి గురైంది. ఆమె ఖమ్మం వెళ్లే బస్సు ఎక్కుతుండగా ఇద్దరు అగంతకులు బస్సు దిగుతున్నట్లు హడావుడి చేశారు. కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌లో చూసేసరికి సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో మరొకరి ఫోన్ నుంచి కాల్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్‌కు ఫిర్యాదు చేయగా బస్టాండ్‌లోని సీసీ టీవీల పుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. బస్టాండ్‌లో నిఘా మరింత పెంచుతామని సీఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

మణుగూరు టౌన్: పట్టణంలోని పీవీ కాలనీలో ఉన్న ఓ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదు చోరీ చేసిన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పీవీకాలనీలోని ఏరియా ఆస్పత్రి వద్ద ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి రూ.5 వేల చోరీ చేశారు. భక్తుడు, అంబులెన్స్ డ్రైవర్ రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

పెదవాగుకు పోటెత్తిన వరద

- గేట్లు తెరిచి నీటిని బయటకు వదులుతున్న సిబ్బంది
- 'రింగ్‌బండ్'కు పొంచి ఉన్న ముప్పు..!



పెదవాగు ప్రాజెక్టుకు భారీగా చేరిన వరదనీరు

అశ్వారావుపేటరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో గల పెదవాగు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు పోటెత్తుతోంది. శనివారం ఉదయం నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా వరద నీరంతా దిగువన ఉన్న ఈ ప్రాజెక్టులోకి చేరుతోంది. దీంతో సిబ్బంది రెండు గేట్లు ఎత్తి వరద నీటిని బయటకు తరలిస్తున్నారు.

'రింగ్‌బండ్'కు ప్రమాదమేనా ?

గత జూలై 18న కురిసిన అతి భారీ వర్షాలతో పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు భారీ గండ్లు పడి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో ప్రాజెక్టు దిగువ, ఎగువ ప్రాంతాల్లో ఉన్న వందలాది ఎకరాల్లో పంట నష్టంతోపాటు, గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. కాగా, తెలంగాణ ప్రాంత రైతలకు ఈ సీజన్‌లోనే పెదవాగు ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రాజెక్టు ఆనకట్టకు పడిన భారీ గండి వద్ద 250 మీటర్ల వరకు తాత్కాలిక 'రింగ్‌బండ్' నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పనులను జూలై 27న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించగా.. యుద్ధ ప్రాతిపదికన చేపట్టి శనివారం నాటికి పూర్తి చేశారు. కాగా, రింగ్‌బండ్‌ను స్పిల్‌వే నుంచి మీటరు ఎత్తులో నిర్మించగా, మరో మీటరుపైకి నిర్మించాల్సి ఉంది. ఈ క్రమంలోనే కుండపోతగా వర్షం పడుతోంది. ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మూడు గేట్లు కిందకే దించి ఉంచగా, మరో రెండు గేట్లు మాత్రం పైకి లేపి ఉంచారు. దీంతో ఈ రెండు గేట్ల గుండా ప్రస్తుతానికి వరదనీరు ఒక మీటరు ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో రింగ్ బండ్ కట్టకు, స్పిల్ వే ప్రవాహానికి కొద్ది వ్యత్యాసమే ఉంది. వర్షం మరింత పెరిగి, ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగి స్పిల్ వే వద్ద గంటల వ్యవధిలోనే మరో అర మీటరు ఎత్తుకు చేరితే రింగ్ బండ్ కట్ట మీదుగా వరదనీరు పారుతుంది. ఇలా జరిగితే రింగ్ బండ్ కట్ట వరద ప్రవహంలో తుడిచి పెట్టుకుపోతుంది. ఇప్పటికే రెండు మూడు చోట్ల లీకవుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగితే రింగ్‌బండ్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని అధికారులు కూడా చెబుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు, అధికారుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై ప్రాజెక్టు డీఈఈ మోతీలాల్‌ను 'సాక్షి' వివరణ కోరగా..రింగ్ బండ్ నిర్మాణాన్ని పూర్తి చేశామని, కట్టను మరో మీటర్ ఎత్తు నిర్మించే పనులే ఉన్నాయన్నారు. ఈ క్రమంలోనే కుండపోత వర్షం కారణంగా పనులు నిలిపివేశామన్నారు. ప్రస్తుతానికి వరద ప్రవాహం, ఔట్ ఫ్లోలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా ఇన్‌ఫ్లో పెరిగితే కట్టకు ముప్పు వాటిల్లుతుందన్నారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలి

కొత్తగూడెంఅర్బన్: ఏపీలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించడంతో పాటు అన్ని వసతులు కల్పించాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నేషనల్ కోఆర్డినేటర్ చార్వాక ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో వెయ్యి మందికి విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైనా యాజమాన్యం విషయం విషయం బయటికి రాకుండా జాగ్రత్త పడిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 1,194 మంది ఆస్పత్రి పాలయ్యారని, ఇకనైనా నాణ్యమైన భోజనం సమకూర్చడంతో పాటు విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

జీవాల పెంపకంపై దృష్టిపెట్టాలి

బూర్గంపాడు: గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధికి గొర్రెలు, మేకల పెంపకంపై దృష్టి పెట్టాలని ఐటీసీ పీఎస్‌పీడీ మానవ వనరుల విభాగం మేనేజర్ చెంగలరావు సూచించారు. కోయగూడెం రైతువేదికలో ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవాల పోషణ, సంరక్షణ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 50 మంది మహిళలకు మూడురోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్‌కే మేనేజర్ జయప్రకాశ్ రామస్వామి, హేమంత్, సాగర్, గీత పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: తండ్రి నిర్మించుకున్న రేకుల పాకను కుమారులు కూల్చివేసిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన బల్లెం వెంకటేశ్వర్లు రేకులతో పాక నిర్మించుకున్నాడు. కాగా గత నెల 21న ఆయన కుమారులు లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, శ్రీనివాస్‌లు కలిసి కూల్చివేశారు. తండ్రి శనివారం ఫిర్యాదు చేయగా, ముగ్గురు కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సురేశ్ తెలిపారు.

జామాయిల్ చెట్లు నరికిన వారిపై..

పాల్వంచరూరల్: మూడు నెలల క్రితం జామాయిల్ చెట్లను నరికిన ముగ్గురు వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథన ప్రకారం.. మండల పరిధిలోని దంతలబోరు గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశ్వర్లు ఐదెకరాల్లో జామాయిల్ తోట వేశాడు. కాగా జామాయిల్ చెట్లను అదే గ్రామానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, రామారావులు కలిసి నరికి విక్రయించుకున్నారు. బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

● కిన్నెరసాని మూడు గేట్లు ఎత్తివేత



కిన్నెరసాని గేట్ల నుంచి విడుదలవుతున్న వరద

పాల్వంచరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరద పెరుగుతోంది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో శనివారం ఉదయం 403.30 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తివేసి 8 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. కాగా, ఇన్నాళ్లు రాత్రివేళ మాత్రమే గేట్లు ఎత్తుతుండగా ఒకేసారి వరద పెరగడంతో శనివారం ఉదయమే ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో రాజాపురం వద్ద లోలెవల్ చప్టాపై వరద చేరి 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

● తాలిపేరుకు పెరుగుతున్న వరద



ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద

22 గేట్లు ఎత్తి 54,284 క్యూసెక్కుల వరద నీరు విడుదల

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. ప్రాజెక్టు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద పెరుగుతుండగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రం ప్రాజెక్టు 25 గేట్లలో ఏడు పూర్తిగా, 15 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 54,284 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తుండగా తాలిపేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, వరద నేపథ్యాన 71.62 మీటర్లుగా స్థిరీకరిస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ తిరుపతి తెలిపారు.

యువకుడికి గుండెపోటు.. సీపీఆర్‌తో స్పృహలోకి..



స్పృహ కోల్పోయిన యువకుడికి సీపీఆర్ చేస్తున్న ఆర్‌ఎంపీ శ్రీనివాస్

పాల్వంచరూరల్: ఓ యువకుడు శనివారం గుండెపోటుకు గురికాగా ఆర్‌ఎంపీ వైద్యుడు సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చాడు. అనంతరం చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండల పరిధిలోని యానంబైల్ గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన కనగంటి సాంబశివరావు(25) శనివారం గ్రామంలో గ్రామదేవత పూజల నిర్వహణకు ఆలయంలో మామిడితోరణాలు కడుతున్నాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మిత్రులు, కుటుంబ సభ్యులు కిన్నెరసానిలోని ఆర్‌ఎంపీ వైద్యుడు శ్రీనివాస్ వద్దకు తరలించగా, అతనికి సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చాడు. అనంతరం అక్కడి నుంచి చికిత్స నిమిత్తం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఏఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. పడమటనర్సాపురం గ్రామానికి చెందిన కిన్నెర గోపయ్య(35) కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలో ఇంట్లో పడి ఉన్నాడు. దీంతో కుటుంబీకులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తల్లి రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పేదలను విస్మరించిన మోదీ పాలన

రేపు సీపీఐ ఆధ్వర్యాన ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఆందోళన



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలను విస్మరించి పాలన సాగిస్తోందని.. సంపన్నవర్గాలు, కార్పొరేట్ శక్తుల కోసమే వారు పనిచేస్తున్నారని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు. దశాబ్దకాలంలో నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరగగా, అల్పాదాయ వర్గాల రాబడి మాత్రం కనిష్టస్థాయికి చేరిందన్నారు. గత పాలకులు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ చట్టాన్ని అమలు చేయగా, మోదీ ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రసాయనిక ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక జనగణన చేయకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ పథకాలు దక్కడం లేదని తెలిపారు. ఇకనైనా జనగణన చేపట్టడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ప్రసాద్ కోరారు. సమావేశంలో నాయకులు తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలి

వైరా/మధిర: మిరప నర్సరీల నిర్వాహకులు లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంవీ మధుసూదన్ సూచించారు. వైరా, మధిరలోని రైతువేదికల్లో శనివారం నర్సరీ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన యజమానులకు సూచనలు చేశారు. లైసెన్స్ లేకుండా నర్సరీ నిర్వహించొద్దని, ప్రభుత్వం ఆమోదం పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. అలాగే, పూర్తిస్థాయిలో వివరాలతో రికార్డులు నిర్వహిస్తూ రైతులకు బిల్లులు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.50 వేలు జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష.. నష్టం తీవ్రత ఆధారంగా రెండూ విధించే అవకాశముందని ఆయన తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు ఆకుల వేణు, జి.నగేశ్, ఎ.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పాల్వంచరూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బిక్కుతండా సమీపంలో రాహుల్‌గాంధీ నగర్‌కు చెందిన కొల్లి నరేందర్(34) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో మనస్తాపం చెంది శుక్రవారం పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య అన్విత, పాప ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.బి.సురేష్ తెలిపారు.

జ్వరంతో మహిళ..

మణుగూరు టౌన్: రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వివాహిత శనివారం మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం గనిబోయిన లక్ష్మి(35) మూడు రోజులుగా జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు మణుగూరు ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం, ఆతర్వాత ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

తనయుడి మరణం తట్టుకోలేక..

- మృతిచెందిన విషయం తెలియగానే ఆగిన తల్లి గుండె..
- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృతితో విషాదం



సాగర్ (ఫైల్)



రామిని (ఫైల్)

చంద్రుగొండ: కుమారుడి మరణాన్ని తట్టుకోలేని తల్లి రెండు రోజుల తేడాతో మృతి చెందిన ఘటన మండలంలోని తుంగారంలో చోటుచేసుకుంది. గ్రామంలోని వెంగళరావు కాలనీకి చెందిన గుగులోత్ సాగర్ (21) శుభకార్యాలకు డెకరేషన్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించగా, ఆమెతో పెళ్లికి కుటుంబసభ్యులు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన సాగర్ నెలరోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 29వ తేదీన (గురువారం) మృతిచెందాడు. గుగులోత్ రామిని, లక్ష్మణ్‌లకు ఏకైక సంతానమైన సాగర్ ఆరోగ్యం క్షీణిస్తున్న క్రమంలోనే తల్లి రామినికి గుండెపోటు వచ్చింది. దీంతో కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, కుమారుడి మరణవార్తను రెండు రోజుల పాటు ఆమెకు తెలియనివ్వలేదు. శనివారం విషయం తెలిసిన వెంటనే ఆస్పత్రిలోనే తల్లి గుండె ఆగింది. రెండు రోజుల వ్యవధిలోనే కుమారుడు, తల్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



సోమయ్య (ఫైల్)

కారేపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్ముగూడెం స్టేజీ వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబోడుకు చెందిన రైతు పందుల సోమయ్య (54) రెండు రోజుల కిందట తన కుమారుడు వీరబాబు నివాసముంటున్న నేలకొండపల్లి మండలం అప్పల నరసింహాపురం వెళ్లాడు. అక్కడ తన కుమారుడు మిర్చి తోట వేస్తుండగా పనులో సాయం చేసి శనివారం తిరుగు పయనమయ్యాడు. ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి ఎర్రబోడు వెళ్లేందుకు కొమ్ముగూడెం స్టేజీ వద్ద దిగిన ఆయన రోడ్డు దాటుతుండగా ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వేగంగా వెళ్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో సోమయ్య తలకు తీవ్ర గాయం కావడంతో మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా, సోమయ్యకు భార్య వీరమ్మ, కుమారుడు వీరబాబు, కుమార్తె వాణిశ్రీ ఉన్నారు.